క్లుప్తంగా

నేడు కార్యకర్తల సమావేశం

వీరపునాయునిపల్లి: మండల కేంద్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి కమలాపురం నియోజకవర్గ ఇన్చార్జి నరేన్ రామాంజుల్‌రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన తెలియజేశారు. ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు హాజరుకావాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

పులివెందుల రూరల్ : ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సోమవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడిందని ఎంపీడీఓ రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి కొంతమంది అధికారులు మాత్రమే హాజరయ్యారని, ప్రజాప్రతినిధులందరూ హాజరు కాకపోవడంతో సమావేశాన్ని 10 రోజులకు వాయిదా వేశామని పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

వల్లూరు (చెన్నూరు) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ పురుషోత్తమరాజు సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నది పరివాహ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు పెన్నా నదిలోకి దిగవద్దని తెలిపారు. మూడు రోజులపాటు వర్ష సూచనల నేపథ్యంలో ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగువ ప్రాంతంలో అధికంగా వర్షాలు పడ్డాయని, పెన్నా పరివాహక ప్రాంతాల ప్రజలకు సమస్య వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. కొత్త వ్యక్తులు ఎవరైనా నది పరివాహక ప్రాంతాల్లో సంచరిస్తే సమాచారం అందించాలని సూచించారు.

భాగవత పఠనం



భాగవత పఠనం చేస్తున్న భాగవత మండలి సభ్యులు

వేముల : మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామంలో వెలసిన సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం భాగవత పఠన కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో పులివెందుల భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో భాగవత మండలి సభ్యులు భాగవత పఠనం చదువుతున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో తులతూగాలని కోరుతూ ఆలయంలో ఏడు రోజులపాటు భాగవత పఠనం చదువుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పంచాయతీలకు నిధులు

పెద్దముడియం: మండలంలోని 9 గ్రామ పంచాయతీలకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.1.88 కోట్లు నిధులు మంజూరైనట్లు ఏపీఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. భీమగుండంకు రూ.17 లక్షలు, పాలూరుకు రూ.12.50 లక్షలు, పాపాయపల్లెకు రూ.7 లక్షలు, పెద్దముడియంకు రూ.68 లక్షలు, పెద్దపసుపులకు రూ.36 లక్షలు, సుద్దపల్లెకు రూ.26 లక్షలు, ఎన్.కొట్టాలపల్లెకు రూ.3 లక్షలు, చిన్నపసుపులకు రూ.10 లక్షలు, జె.కొత్తపల్లె రూ.8.50 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు, కాంపౌండ్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

సన్మానం



పుల్లారెడ్డిని సన్మానిస్తున్న బ్యాంక్ అధికారులు

ముద్దనూరు: స్థానిక కెనరా బ్యాంకులో సోమవారం ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తమ ఖాతాదారులను సన్మానించారు. ఉత్తమఖాతాదారుడైన రిటైర్డ్ లెక్చరర్ పుల్లారెడ్డిని జిల్లా మేనేజర్ సుబ్బరాయుడు, స్థానిక బ్యాంకు మేనేజర్ కృష్ణారెడ్డి సన్మానించారు. దీర్ఘ కాలంగా డిపాజిట్ సొమ్మును బ్యాంకులో జమ చేసినందుకు ఆయనను సత్కరించారు.

పంచాయతీలకు మహర్దశ

వేంపల్లె : కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు మహర్దశ పట్టనున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. వేంపల్లె పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.988.77 కోట్లు విడుదల చేశారని తెలిపారు. గ్రామ రాజ్యంతోనే రామ రాజ్యం నిర్మాణమవుతుందని పేర్కొన్నారు.

అందుబాటులో యూరియా

ముద్దనూరు: రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. 19.98 టన్నుల యూరియా, 20 టన్నుల డీఏపీ ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు యూరియాను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఆశలన్నీ రబీపైనే

- విస్తారంగా మినుము పంట సాగు
- నియోజకవర్గ వ్యాప్తంగా 15వేల ఎకరాల్లో..
- పెరుగుతున్న పెట్టుబడి

రైతుల్ని ఖరీఫ్ పూర్తిగా ముంచేసింది. సకాలంలో వర్షాలు పడక నష్టపోయారు. ఇప్పుడు రైతుల ఆశలన్నీ రబీ సాగు మీదే. ఎలా ఉంటుందో మరి. ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా రబీ సీజన్‌కు రాయితీపై ఇవ్వాల్సిన పప్పుశనగ విత్తనాల్లో ప్రభుత్వం కోత పెడుతోంది. దీంతో శనగపంటపై రైతులు ఆసక్తి చూపడం లేదు. మినుము పంటను సాగు చేస్తున్నారు. వెరసి రబీ ఆదుకొంటుందా? ఖరీఫ్‌లాగే కష్టాలపాలు చేస్తుందా? రైతులు ఆశ నిరాశలతోనే రబీపై గంపెడాశ పెట్టుకున్నారు.



వేముల వద్ద సాగు చేసిన మినుము పంట

వేముల : ఈ ఏడాది రబీ సాగుపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి భూములు పదును కావడంతో విస్తారంగా మినుము పంటను రైతులు సాగు చేశారు. ఈ ఏడాది శనగ పంట సాగు విస్తీర్ణం తగ్గనుంది. ప్రతి ఏడాది రబీ సీజన్‌లో శనగ పంట విస్తారంగా సాగయ్యేది. అయితే కూటమి ప్రభుత్వం సబ్సిడీలో కోత విధించడంతో పాటు అరకొరగా శనగ విత్తనాలను సరఫరా చేసి రైతుల జీవితాలతో అటలాడుకుంటోంది. ఈ ఏడాది రైతులు రబీలో ఎక్కువ భాగం మినుము పంట సాగుపై దృష్టి పెట్టారు.

ఆశల సాగు

ఈ ఏడాది రబీలో మినుము పంట విస్తారంగా సాగైంది. పులివెందుల నియోజకవర్గంలో 15 వేల ఎకరాలకుపైనే సాగు చేసినట్లు అంచనా. ఖరీఫ్‌లో అలస్యంగా అరకొర కురిసిన వర్షాలకు వేరుశనగ, మినుము, పత్తి పంటలు సాగు చేసుకున్నారు. సాగు అనంతరం వర్షాలు లేక పంటలు ఎండిపోయాయి. దీంతో పంటలను దున్నేశారు. వర్షాభావంతో పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులు రబీపై ఆశలు పెట్టుకుని మినుము సాగు చేశారు.

పెరిగిన పెట్టుబడి

మినుము సాగులో పెట్టుబడులు కూడా పెరిగిపోయాయి. సాగులో ఎకరాకు రూ.15 వేలకుపైనే పెట్టుబడులు అవుతున్నాయి. మినుము పంటకు ఎక్కువగా తెగుళ్లు సోకుతుంటాయి. పంట సాగు చేసిన మొదలు దిగుబడులు చేతికి వచ్చే వరకు 8 సార్లు మందులు పిచికారీ చేయాలి. పంట సాగు చేసి 20 రోజులు కావస్తోంది. ఇప్పటికే ఒకసారి మినుము పంటను మందును పిచికారీ చేశారు. విత్తనాలు, ఎరువులు, సేద్యాలకు అయిన ఖర్చుల కంటే మందులకే రెట్టింపు అవుతోందని రైతులు అంటున్నారు.

వర్షాలతోనే మినుము పంట దెబ్బ

పంట సాగు చేశాక వర్షాలు ఎక్కువగా వస్తే మినుము పంట దెబ్బతినే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కాయదశలో పంట ఉన్నప్పుడు వర్షాలు కురిస్తే కాయలు దెబ్బతిని నష్టపోయే అవకాశం ఉంది. తెగుళ్లు సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నా తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడితే పంట పచ్చగా మారిపోతుంది. దీని నివారణకు ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం ఉండదని రైతులు అంటున్నారు. వాతావరణంలో మార్పులు, తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్నట్లయితే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

వంద రోజుల్లో దిగుబడి

మినుము పంటలో వంద రోజుల్లోనే దిగుబడులు వస్తాయి. పంటను ఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటే తప్ప దిగుబడులు వచ్చే పరిస్థితి ఉండదు. ఎకరాకు నాలుగైదు క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయనే ఆశతో రైతులు ఉన్నారు. ప్రతికూల పరిస్థితులు ఏర్పడితే పెట్టుబడులు కూడా గిట్టుబాటు అయ్యే పరిస్థితి ఉండదని రైతులు అంటున్నారు. సాగులో పెట్టుబడులు అవుతున్నా దిగుబడులు వస్తాయనే ఆశతో సాగు చేశామని, దిగుబడులు ఎలా ఉంటాయోనని రైతుల్లో ఆందోళన నెలకొంది. అన్ని అనుకూలిస్తే లాభాలు వస్తాయని చెబుతున్నారు.

ఐదు ఎకరాల్లో సాగు చేశా



ఐదు ఎకరాల్లో మినుము పంటను సాగు చేశాను. పంట దిగుబడులు వచ్చే సమయానికి తెగుళ్లు సోకకుండా ముదస్తు జాగ్రత్తగా మందులు పిచికారీ చేయాలి. ఇందుకోసం వేలకు వేలు ఖర్చు చేయాలి. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని ఆశతో ఉన్నాం. ఖరీఫ్‌లో నష్టపోయాం. రబీపై ఆశలు పెట్టుకుని మినుము సాగు చేశాం. – సుదర్శన్‌రెడ్డి, మినుము రైతు, గొందిపల్లె

అధికమవుతున్న పెట్టుబడులు



మినుము సాగులో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. సాగులో ఎకరాకు రూ.15 వేలకుపైనే పెట్టుబడులు పెట్టాం. సకాలంలో వర్షాలు పడటంతో అదునులో పంట సాగు చేశాం. దిగుబడులు బాగా వస్తాయనే ఆశతో ఉన్నాం. ధరలు కూడా ఆశాజనకంగా ఉంటే ఆదాయం ఉంటుంది. వర్షాలు ఎక్కువగా పడితే పంట దెబ్బతిని నష్టపోతాం. – గంగిరెడ్డి, మినుము రైతు, నల్లచెరువుపల్లె

రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు జాబితా



పంట నమోదు జాబితాను చూసుకొంటున్న రైతులు

వీరపునాయునిపల్లి: ఖరీఫ్ సీజన్ సాగు చేసిన పంటల నమోదు జాబితా మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. సోమవారం అలిదెన రైతు సేవా కేంద్రంలో జాబితాను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట సాగు చేసి నమోదు చేయించుకొన్న ప్రతి రైతు తమ పేరు, సాగు చేసిన పంట వివరాలు, విస్తీర్ణం జాబితాలో సక్రమంగా ఉందా లేదా అని చూసుకోవాలని సూచించారు. పొరపాట్లు ఉంటే ఈ నెల 16వ తేదీలోపు సంబంధిత వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. తుది జాబితాను ఈ నెల 18న అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించడంతో పాటు గ్రామ సభలు కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

వర్షాల నుంచి పంటలను కాపాడుకొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని శ్యామ్‌బాబు సూచించారు. వరి పంట సాగు చేసిన రైతులు పొలంలో నీరు ఎక్కువగా నిలువ ఉండకుండా బయటకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎరువులు వేయకూడదని అవసరమైతే వర్షాలు తగ్గిన తరువాత వేసుకోవాలని తెలిపారు. రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారిని లేదా రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

డీఎస్సీలో ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : సాంఘీక, గిరిజన సంక్షేమశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో 5,050 మంది ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎస్‌డబ్ల్యూఓ బి.గురుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ అర్హత కలిగి వార్షిక ఆదాయం రూ.2.50లక్షల లోపు ఉండాలని, ఈ నెల 21వ తేదీ లోపల జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి అర్హులైన అభ్యర్థులకు మెరిట్ లిస్ట్ ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్సీఎస్టీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తక్షణ చర్యలు తీసుకోవాలి

కడప కార్పొరేషన్: ప్రజలు సమర్పించే ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్ర ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 16 అర్జీలు రాగా, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి-6, రెవెన్యూ-5, టౌన్‌ప్లానింగ్-3, హెల్త్ విభాగం-1, ఎడ్యుకేషన్-1 వచ్చాయి. వీటిని సకాలంలో పరిష్కరించాలని ఏడీసీ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డా. చంద్రశేఖర్, ఈఈలు ధనలక్ష్మి, నారాయణస్వామి, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

సోమవారం ఉదయం మార్నింగ్ విజిట్‌లో భాగంగా అడిషనల్ కమిషనర్ నాగరాజుపేట, జెడ్పీ ఆఫీసు, ఎర్రముక్కపల్లె ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. జెడ్పీ కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్ చుట్టూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

జమ్మలమడుగును అభివృద్ధి చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు: కౌన్సిల్ సభ్యుల సహకారంతో జమ్మలమడుగును అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మున్సిపల్ చైర్పర్సన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా మున్సిపాలిటి అభివృద్ధితో పాటు ప్రజలకు తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణంపై ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఇటీవల కన్నెలూరులో కలుషితమైన నీరు తాగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని పేర్కొన్నారు.

సమావేశానికి సకాలంలో రాకపోతే ఎలా...

ఎమ్మెల్యే వచ్చే వరకు సమావేశాన్ని నిర్వహించమని చెప్పడం ఏమిటని ఒకటో వార్డు కౌన్సిలర్ ముల్లా జానీ ప్రశ్నించారు. అధికారులు సమయం ఇవ్వకుండా ఒక రోజు ముందు 36 పేజీల పుస్తకాన్ని ఇచ్చి సమావేశానికి రావాలని చెప్పడం సరికాదన్నారు. అజెండా, విధివిధానాల గురించి ముందుగానే సమాచారం ఉంటే బాగుండేదని చెప్పారు. అభివృద్ధి పనుల బిల్లులను అధికారులు వరుస క్రమంగా చెల్లించాలని ముల్లాజానీ కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మైలవరం మండల కేంద్రంలో రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆదేవిధంగా దొమ్మరనంద్యాల గ్రామంలో కూడా రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎంపీడీఓ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల నిధులపై ఆడిట్ చేయాలి

ప్రొద్దుటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చిన నిధుల జమా ఖర్చులపై ఆడిట్ చేయాలని ప్రజా పక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మీరెడ్డి కోరారు. సోమవారం ఆయన తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పుత్తా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులను ప్రజా ప్రతినిధులు, అధికారులు లాలూచి పడి అభివృద్ధి పనులు చేయకున్నా నిధులు డ్రా చేస్తున్నారని ఆరోపించారు. నిధులను సక్రమంగా వినియోగించి అభివృద్ధి చేయాలని కోరారు. ప్రజాపక్షం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బద్వేలు అర్బన్ : రాబోవు నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బద్వేలు మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా వర్షాల వలన ఇబ్బందులు తలెత్తినా, చెట్లు విరిగిపడినా కంట్రోల్ రూమ్ నెంబర్ 63019 56870 నెంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు. కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. అలాగే ఆయా సచివాలయాల్లోనూ ఫిర్యాదు చేయవచ్చని కోరారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు



పేరుకుపోయిన చెత్తచెదారం

తొండూరు : మండల పరిధిలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడపడితే అక్కడ మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని గ్రామాల్లో డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవటంతో నీరంతా రోడ్ల మీదకే చేరుతుంది. మురుగు పచ్చగా మారి దోమలు వృద్ధి చెందటంతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో చిన్నారులు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. అసలే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారటంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. డెంగీ, మలేరియా వ్యాపిస్తాయని భయపడుతున్నారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పల్లెల వైపు కన్నెత్తి చూడడం లేదు. పలుమార్లు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ సమస్యను పరిష్కరించలేదు. గత ఏడాది వర్షాకాల సీజన్‌లో పలువురు వ్యాధుల బారినపడ్డారని, పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తమ బాధలు ఎవరికీ పట్టడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో డ్రైయిన్లు తవ్వకంతో పాటు మురుగు నిల్వ లేకుండా చూడాలని కోరుతున్నారు. వ్యాధుల బారిన పడకుండా కాపాడాలని వేడుకుంటున్నారు.



మురికి కూపంగా మారిన రోడ్డు

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు



మృతురాలి కార్నియాలను సేకరిస్తున్న నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు తదితరులు

పులివెందుల టౌన్ : నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు ప్రసాదించవచ్చునని నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో నివాసముంటున్న నర్రాల ఆదిలక్షుమ్మ (83) మరణించింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్ర సేకరణ కేంద్ర సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో రాజు సిబ్బందితో కలిసి మృతురాలి ఇంటికి వెళ్లి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించినా నేత్రదానంపై అవగాహన కల్పించి 9966509364 లేదా 7093204537 నంబర్‌లకు సమాచారం ఇచ్చి అంధరహిత సమాజానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మృతురాలి కుటుంబ సభ్యులు హేమశిఖరాలరెడ్డి, అరుణదేవి, జయలక్షుమ్మ, లక్ష్మీదేవి, పద్మావతి, తులశమ్మ, వెంకటరెడ్డి, రామపుల్లారెడ్డి, రామసుబ్బారెడ్డి, రామశేఖరరెడ్డి ఉన్నారు.

గోకులం షెడ్డు నిర్మాణానికి భూమి పూజ



సింహాద్రిపురం: గోకులం షెడ్డు నిర్మాణానికి భూమి పూజు చేస్తున్న ఎంపీడీఓ తదితరులు



లింగాల : సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

సింహాద్రిపురం : పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చవ్వారిపల్లె గ్రామంలో సోమవారం గోకుల షెడ్డు నిర్మాణానికి ఎంపీడీఓ కృష్ణమూర్తి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ఎనిమిది గోకుల షెడ్లు మంజూరయ్యాయని, ఇందులో చవ్వారిపల్లెలో గ్రామసభ నిర్వహించి గోకులం షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఈసీ శ్రీనివాసులరెడ్డి. టెక్నికల్ అసిస్టెంట్లు రజిత, లక్షుమయ్య, ఉపాధి సిబ్బంది, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లకు శంకుస్థాపన

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం చింతకొమ్మదిన్నె పంచాయతీలో నాలుగు సిమెంటు రోడ్లకు, సాయంత్రం బుసిరెడ్డిపల్లె గ్రామంలో రెండు సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సీకే దిన్నె సర్పంచ్ మహేశ్వరి, బుసిరెడ్డిపల్లె సర్పంచ్ రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు దొండపాటి వెంకటరెడ్డి, మండల అభివృద్ధి అధికారి కుళాయిబాబు, పంచాయతీ అధికారులు, ఉపాధి ఏపీఓ, సిబ్బంది పాల్గొన్నారు.

లింగాల మండలంలో..

లింగాల : లింగాల మండలం ఇప్పట్ల, అంబకపల్లె గ్రామాల్లో సోమవారం మండల స్థాయి అధికారులు పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ కంపోనెంట్ కింద మంజూరైన సీసీ రోడ్లను వారు ప్రారంభించారు. ఇప్పట్ల గ్రామంలో నాలుగు రోడ్లకు రూ.8.50 లక్షలు, అంబకపల్లె గ్రామంలో రెండు రోడ్లకు రూ.8.34 లక్షల మంజూరైన రోడ్లను ప్రారంభించామని పీఆర్ ఏఈ మనోహర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, మండలస్థాయి వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలు

పెద్దముడియం: ప్రభుత్వం సబ్సిడీపై అందించే శనగ విత్తానాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అరుణ తెలిపారు. సోమవారం సబ్సిడీపై రైతులకు అందించే శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. సోమవారం పెద్దపసుపుల గ్రామంలో 500 క్వింటాళ్ల శనగలను రైతులకు పంపిణీ చేసినట్లు అరుణ తెలిపారు. మిగతా గ్రామాల్లో కూడా రైతుల అవసరం మేరకు శనగలను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. క్వింటా రూ.9,400 కాగా 25 శాతం రాయితీతో రూ.7,050తో పంపిణీ చేస్తున్నామని ఏఓ తెలిపారు. శనగ విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టం పటిష్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతి కళ

ప్రొద్దుటూరు క్రైం : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతి కళ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రి పీపీ యూనిట్‌లో డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ మాట్లాడుతూ ఆడబిడ్డను రక్షించాలంటే లింగ నిర్ధారణ జరగకుండా చేయాలన్నారు. గర్భస్రావాలు జరగకుండా చూడాలని, ఎవరైనా స్కానింగ్ సెంటర్ వారు లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే కమిటీ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. చాలా మంది కుటుంబంలోని పెద్దల ఒత్తిడి కారణంగా ఆడ శిశువు అని తెలియగానే గర్భస్రావానికి సిద్ధమవుతున్నారన్నారు. తల్లిదండ్రులు ఆడ బిడ్డ అయినా మగ బిడ్డ అయినా సమానంగా చూసుకుని మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, డాక్టర్ శివ ప్రసాద్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు శ్రీదేవి, దేవదాసు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణలో కీలకపాత్ర పోషించండి

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు పట్టణ సుందరీకరణలో కీలకపాత్ర పోషించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు మరింత చిత్తశుద్ధితో పనిచేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య కార్మికుల సమస్యలను ఈ నెలాఖరులోపు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పట్టణ సుందరీకరణలో తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ సిబ్బంది, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పోరుమామిళ్ల : వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో బద్వేలు నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలియజేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తీవ్ర అల్పపీడనం కారణంగా పిడుగులు పడే అవకాశం ఉందని, అలానే 4 రోజులపాటు వర్షాలు ఉంటాయన్నారు. అవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలని ప్రజలను ఆయన కోరారు. చెట్ల కింద, కరెంటు స్తంభాల కింద ఉండరాదని, తేమ ఉన్న కడ్డీలను పట్టుకోవద్దని ఆయన సూచించారు.